నిర్వాసితుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

జీలుగుమిల్లి:పోలవరం నిర్వాసితులకు కేటాయించిన భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఐటిడిఏ పిఒ జివి.సత్యనారాయణ సంబంధిత అధికారులను సూచించారు. మంగళవారం వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని వరద ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలేరుపాడు మండలం నుంచి 747 కుటుంబాలను పునరావాస కాలనీకు తరలించారన్నారు. వాటిలో 664 కుటుంబాలకు సంబంధించి భూమికిభూమి కింద 1831 ఎకరాలు కేటాయించామన్నారు. ఇంకా కొన్ని కుటుంబాలకు సంబంధించిన భూములకు మార్పులు, చేర్పులు చేయాల్సి ఉందన్నారు. అదే విధంగా పోలవరం మండలం నుంచి వచ్చిన పలు గ్రామాలకు కేటాయించిన కొంతభూమి వివాదంలో ఉందగా ఆ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం రీ సర్వే గురించి తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్ సింగ్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కొండలపైన బిక్కుబిక్కుమంటూ..!

వేలేరుపాడు మండలం రుద్రమ్మకోటవాసుల పరిస్థితి దారుణం

వరద చుట్టుముట్టడంతో కొండపైకి చేరిన వంద కుటుంబాలు

వారం రోజులైనా సగం మందికే కూరగాయలు, నిత్యావసరాల పంపిణీ

గుడారాలు వేసుకునేందుకు టార్పలిన్లూ ఇవ్వని దుస్థితి

కొండపై గుడారాలు వేసుకుని ఉంటున్న రుద్రంకోట గ్రామస్తులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరదలకు పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం కారణంగా ప్రతియేటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత వరదలకు ఈ రెండు మండలాల్లో 41 నివాసిత ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. 4,779 కుటుంబాలకు చెందిన 13,764 మంది వరద బాధితులుగా మారారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 12 పునరావాస కేంద్రాల్లో 4,275 మంది ఉండగా, మిగిలిన 9,489 మంది కొండలు, గుట్టలపైనే కటిక చీకట్లో కాలం గడుపుతున్నారు. వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట గ్రామానికి చెందిన వంద కుటుంబాలు పక్కనే ఉన్న కొండపైకి చేరి వారం రోజులు గడుస్తోంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో కూరగాయలు, వంటనూనె వంటి నిత్యావసర వస్తువులు అందించని పరిస్థితి. సగం మందికి మాత్రమే ప్రభుత్వ సాయం అందినట్లు అంతా ఆవేదన చెందుతున్నారు. గతేడాది దాదాపు నెల రోజులు ఇదేవిధంగా కొండపైనే తల దాచుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. గుడారాలు వేసుకునేందుకు ప్రభుత్వం కనీసం టార్పలిన్లు కూడా ఇవ్వలేదని అంతా ఆవేదనకు గురవుతున్నారు. సొంతంగా టార్పలిన్లు కొనుగోలు చేసుకుని గుడారాలు వేసుకున్నారు. కొండపై ఏర్పాటు చేసిన జనరేటర్లు సాయంత్రం కొద్దిసేపు మాత్రమే పని చేస్తున్నాయని అక్కడివారు చెబుతున్నారు. ఈ సమయంలోనే సెల్‌ఫోన్లకు ఛార్జింగ్ వంటివి పెట్టుకోవాలని, తర్వాత కటిక చీకట్లో గడపాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఆదివారం వరద బాధితులను పరామర్శించేందుకు కొండపైకి వెళ్లిన పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజును అక్కడి ప్రజలు నిలదీసిన తర్వాతే కొంతమందికైనా కూరగాయలు, నిత్యావసర వస్తువులు పంపిణీ జరిగింది. కొండపై ఉంటున్న వారికి బాహ్యప్రపంచంతో సంబంధాలు లేకపోవడంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పునరావాస పరిహారం ఇవ్వని కారణంగానే తమ బతుకులు ప్రతియేటా కొండలు, గుట్టల పాలౌతున్నాయని రుద్రమ్మకోట గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వానికి మాత్రం నిర్వాసితుల గోడు మాత్రం పట్టడం లేదు. గతేడాది వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం సైతం ఇప్పటికీ ఈ గ్రామంలో సగం మందికి అందలేదు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి 1,280 కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. వరదకు తలోదిక్కు అన్నట్లు బతుకుతున్న నిర్వాసిత ప్రజలకు వరద సహాయక చర్యలు పూర్తిస్థాయిలో అందించి, పునరావాస పరిహారం అందించాలని అంతా కోరుతున్నారు.

కొద్దిసేపు మాత్రమే జనరేటర్ వెలుగులు

కొక్కిరపాటి రవీంద్ర, రుద్రమ్మకోట

కొండపై ఏర్పాటు చేసిన జనరేటర్లు సాయంత్రం కొద్దిసేపు మాత్రమే పని చేస్తాయి. సెల్‌ఫోన్ ఛార్జింగ్ వంటివి పెట్టుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఆ తర్వాత రాత్రంతా కటిక చీకట్లో ఉండాల్సిందే. కొండపైన ఉన్నవారికి సక్రమంగా కూరగాయలు వంటివి అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చుట్టూ వరదనీరుతో బయటికి వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ప్రతియేటా ఈ బాధలు పడలేకపోతున్నాం. వెంటనే పునరావాస పరిహారం పూర్తిస్థాయిలో అందించాలి.

టార్పలిన్లు కూడా ఇవ్వలేదు

కొక్కిరపాటి శ్రీనివాస్, రుద్రమ్మకోట, వేలేరుపాడు మండలం

గోదావరి వరద చుట్టుముట్టడంతో వారం రోజుల క్రితమే కొండపైకి చేరాం. ఇక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నాం. గుడారాలు ఏర్పాటుకు ప్రభుత్వం కనీసం టార్పలిన్లు ఇవ్వలేదు. దాదాపు వంద కుటుంబాలు కొండపైన ఉన్నాయి. గత ఏడాది వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం కూడా ఇప్పటికీ ఇవ్వలేదు.

సగం మందికే నిత్యావసరాలు

యాతం శ్రీనివాసరావు, రుద్రమ్మకోట

కొండపై వంద కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకూ సగం మందికి మాత్రమే ప్రభుత్వం అందించే కూరగాయలు, నిత్యావసర వస్తువులు వంటివి అందాయి. కొండపైకి వచ్చి వారం రోజులు గడిచింది. గతేడాది ఇదే పరిస్థితి ఉంది. పునరావాస పరిహారం ఇవ్వకపోవడంతో ప్రతియేటా ఈ కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలి.

తగ్గిన వరద ముంపు

గోదావరి ఉధృతి తగ్గుముఖం

రహదారులను వీడని వరద

పలుచోట్ల ధ్వంసమైన రోడ్లు

ప్రజాశక్తి - కుక్కునూరు

17 రోజులుగా గోదావరి వరద పెరుగుతూ, తగ్గుతూ మండల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. దీంతో నిలిచిన రాకపోకలు కొనసాగుతున్నాయి. భద్రాచలంలో గోదావరి వరద మంగళవారం 30 అడుగులకు చేరడంతో మండలాన్ని చుట్టుముట్టిన వరద తగ్గింది. పోలవరం కాపర్ డ్యామ్ బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల కుకునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే పై వరద ఏమాత్రం తగ్గక పోవడంతో 14 గిరిజన గ్రామాలకు గత 17 రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వరద ముంపు నుండి బయట పడిన రహదారులపై అడుగు మందం ఒండ్రు పేరుకుపోవడంతో వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. వేలేరు-బూర్గంపాడు ప్రధాన రహదారిపై వరద ఉదతంగా ప్రవహించడంతో రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి ధ్వంసం కావడంతో తప్పని పరిస్థితుల్లో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పున:నిర్మించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ఉధృతి

పోలవరం ప్రాజెక్టు నుండి 9.29 లక్షల క్యూసెక్కులు విడుదల

పోలవరం:పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు నుండి 9,29,921 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 32.320 మీటర్లు, దిగువన 24.000 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం వద్ద 33.070 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం వద్ద 23.500 మీటర్లు, పోలవరం వద్ద 22.577 మీటర్ల నీటిమట్టం నమోదైంది. గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతుండటంతో కడమ్మ స్లూయిస్ గేట్ల నుండి కొండ వాగుల జలాలు గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే కడెమ్మ వంతెన వరద నీటి నుండి బయటపడింది. దీంతో పోలవరం ప్రాజెక్టుకు వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఏటిగట్టుకు కుడివైపున ఉన్న పొలాలు వరద నీటి నుండి క్రమక్రమంగా బయట పడుతున్నాయి.

కుక్కునూరు మండలంలో వరదకు ధ్వంసమైన రోడ్డు

ఏలూరులోన..

మున్సిపల్ కార్మికుల ఉద్యమం ఉధృతం

జిల్లాలో మున్సిపల్ కార్యాలయాల ముట్టడి - అధికారులకు వినతులు

జంగారెడ్డిగూడెంలో..

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయాల ముట్టడిలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, మున్సిపల్ అధికారులకు, ఆందోళనకారులకు మధ్య పెద్దఎత్తున వాగ్వాదం జరిగింది. దీంతో రెండుగంటలపాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది గేటుబయట రోడ్లపైనే నిలబడిపోయారు. కార్యాలయ విధులు స్తంభించాయి. ఈ సందర్భంగా కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అసెంబ్లీలోనూ, బయట మున్సిపల్ కార్మికులకు అనేక హామీలిచ్చారన్నారు. ఆ హామీలను నాలుగున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ అమలు చేయలేదని, అందుకే మున్సిపల్ కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వానికి, మంత్రులకు, అధికారులకు అనేక పర్యాయాలు సమస్యలపై వినతులు అందించినా పట్టించుకోలేదన్నారు. ఈ నెల ఏడో తేదీన కలెక్టర్ కార్యాలయాలు ముట్టడిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 17న చలో విజయవాడ చేపడతామని, రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చే విధంగా పెద్దఎత్తున పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. దానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు లక్ష రూపాయల జీతమైన తక్కువే అని చెప్పిన సిఎం నేడు కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదని, ఇటీవల వచ్చిన సచివాలయ ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేసి, 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోవడం అన్యాయమన్నారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు, సిఐటియు ఏలూరు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు, జార్జి, నాగరాజు, దావీదు, మరియమ్మ, రేణుకేశ్వరరావు, దుర్గారావు, కాళిదాసు, గోపి, రాము, ఏసురత్నం, శివాజీ, పుష్పరాజు, సుగుణరావు, రామారావు, పాప, సత్యవతి, వెంకటలక్ష్మి, రమణమ్మ, భవాని, జోస్సీ, సునీత, దుర్గ, నాగమణి నాయకత్వం వహించారు.

నూజివీడు:స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణాధ్యక్షులు ఎస్‌ఆర్.హనుమనులు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.జయలక్ష్మి, అధ్యక్షులు పి.ఏడుకొండలు, పిఎసిఎస్ నేత మరియదాసు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం:సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసల సూర్యారావు మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు నష్టమే కానీ లాభం చేకూర్చే పని ఒక్కటి చేయలేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభానీ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వానికి అనేకసార్లు వినతులు అందించినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు చల్లా మాణిక్యాలరావు, సంఘ అధ్యక్షులు బి.బాలరాజు, కార్యదర్శి లక్ష్మణ్, వెల్లుల రాజు, జి.వెంకటేష్, ఇంజినీరింగ్ వర్కర్స్ కోశాధికారి లక్ష్మణరావు, తులసీ, మంగ, ఉష, భూలక్ష్మి, సత్యవతి, నాగమణి, శ్రీను పాల్గొన్నారు.

మణిపూర్‌లో అరాచకాలపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం ఆగిరిపల్లి పురవీధులల్లో పాస్టర్స్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని క్రైస్తవ, దళితసంఘాలు శాంతిర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల మానవహారం నిర్వహించి, బస్టాండ్ సెంటర్ వద్ద మోకాళ్లపై నిలబడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తహశీల్దార్ ఎం.ఉదయభాస్కర్‌రావుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ దైవనిరీక్షణకుమార్, చిన్నబాబు, పాల్‌రమేష్, ఐజాక్ జాన్, జార్జి, నిరీక్షణరావు, సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, రాజకీయ నాయకులు పి.రవి, ఎంఆర్‌పిఎస్ నాయకులు సురేష్‌బాబు, ప్రదీప్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మణిపూర్ మారణ హోమం దేశ చరిత్రలోనే అత్యంత నీచమైన ఘటనలని నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బిడి.రవికుమార్ అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పరిమిసాగర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగభరత్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మణిపూర్‌లో అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్ఎస్ కూరగాయల మార్కెట్ వద్ద సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కూరగాయల ఆఫీస్ వద్ద నుండి ఎన్ఎస్ మార్కెట్, బిర్లాభవన్ సెంటర్ మీదుగా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.అప్పారావు, దూళ్ల వీరనాయుడు, గునుపూడి నాగేశ్వరరావు, అన్నవరం, బి.వీరభద్రం పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల భారీ ర్యాలీ

హక్కుల కోసం ఉద్యమించాలి

విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలో ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్‌రాజు

ఏలూరులో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఉద్యోగులందరూ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఎపిఇపిడిసిఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఇ సాల్మన్ రాజు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగుల జిల్లా జెఎసి ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవనం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంది. అధిక సంఖ్యలో ఉద్యోగులు కలెక్టర్ వద్ద ధర్నా చేసి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ఎస్ఇ సాల్మన్ రాజు విద్యుత్ ఉద్యోగుల ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. జెఎసి డిస్కం కన్వీనర్ భూక్య నాగేశ్వరావు, జెఎసి జిల్లా ఛైర్మన్ ఎం.రమేష్, కన్వీనర్లు తురగా రామకృష్ణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. చర్చల పేరుతో ఉద్యోగులను మభ్యపెడుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, ఇక సహించేది లేదని, సమస్యలు పరిష్కరించుకుంటే ఈనెల పదో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ వి.రాము, భీమేశ్వరరావు, సాయిబాబా, కార్యదర్శి బివి.కృష్ణరాజా, నాయకులు రాము, రాధాకృష్ణ, ఆర్.రఘుబాబు, అప్పారావు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'కు విశేష స్పందన

4,10,287 అర్జీలు స్వీకరణ

3,89,387 వినతులు పరిష్కారం

2,657 తిరస్కరణ

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అర్హతున్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే మహోన్నత లక్ష్యంతో గతనెల ఒకటో తేదీ నుంచి నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వివిధ పాఠశాలలు, కాలేజీల ప్రారంభం, అడ్మిషన్ల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని సురక్షా శిబిరాల్లోనే వివిధ ధృవీకరణ పత్రాలను కూడా మంజూరు చేశామన్నారు. వివిధ శాఖలు జారీ చేసే 11 రకాల పత్రాలను ఛార్జీలు లేకుండా అక్కడికక్కడే ప్రజలకు అందించామని తెలిపారు. జిల్లాలోని 605 సచివాలయాల్లో 10,671 మంది వాలంటీర్లు జగనన్న సురక్షలో పాల్గొని 6,92,365 కుటుంబాలకుగాను 6,18,317 సందర్శించి, ప్రభుత్వం అందజేస్తున్న 11 రకాల సర్వీసులను వివరించి, వారి నుండి 4,10,287 అర్జీలను స్వీకరించామన్నారు. 3,89,387 సర్వీస్ సేవలు నేటివరకూ అందజేశామన్నారు. అదేవిధంగా 2,657 అర్జీలకు సరైన ఆధారాలు సమర్పించకపోవడంతో ఆ దరఖాస్తులను తిరస్కరించామన్నారు. మిగిలిఉన్న 6,301 దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయన్నారు. జగనన్న సురక్ష శిబిరాల్లో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,73,329, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లు 1,41,897, ఆధార్‌కు మొబైల్ నెంబర్ అప్‌డేషన్‌కు 17,661, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 319, కొత్త రేషన్ కార్డులు, రైస్ కార్డుల స్ప్లిట్టింగ్‌కు 2,067, మ్యూటేషన్లు 153, హౌస్ హోల్డ్ నుంచి వివాహమైన వారిని వేరు చేసేందుకు 224, వివాహ ధృవీకరణ సర్టిఫికెట్లు 73, సిసిఆర్ కార్డులు 762, ఆర్ఒఆర్1బి సర్టిఫికెట్లు-7,408 జారీ చేశామన్నారు. సురక్ష ప్రోగ్రామ్ ద్వారా గత నెలలో 51 వేల మొక్కలు నాటామన్నారు. 24 కొత్త గ్రామ సచివాలయం భవనాలు, 13 కొత్త రైతు బరోసా కేంద్రాలను, ఎనిమిది వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లను ప్రారంబించామని చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్

స్పందన అర్జీదారుల పట్ల అధికారుల దురుసుతనం తగదు

జంగారెడ్డిగూడెం:స్పందన అర్జీదారులపై అధికారులు దురుసుగా ప్రవర్తించడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అర్జీదారులకు రసీదులు ఇవ్వడం లేదన్నారు. రశీదు అడిగితే తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ వరలక్ష్మి దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. స్పందనలో వినతులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు అపరిమితమవుతున్నారని, వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతనెల 31వ తేదీన తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో కేతవరం గ్రామానికి చెందిన వామిశెట్టి నరుసరావు తనకున్న భూమిని సాగు చేయనీయకుండా విఆర్‌ఒ రమేష్ అడ్డుపడుతున్నారని, గతంలో తహశీల్దార్‌కు దరఖాస్తు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, భూమి సాగు చేసుకోనివ్వాలని విఆర్‌ఒను ప్రాధేయపడినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం స్పందనలో వినతి ఇస్తే అధికారులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ దరఖాస్తును తీసుకోబోమని హెచ్చరించారని తెలిపారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ఏలూరు:ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో మెడికల్, పోలీస్, ఆర్‌టిసి, విద్యుత్ శాఖల అధికారులతో డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై డిఆర్ఒ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ ఈనెల రెండో తేదీ నుండి ఏడో తేదీ వరకూ ఈ పరీక్షలు పెదపాడు మండలం వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ స్కూల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు వివిధ శాఖలకు చెందిన 181 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఉదయం పది గంటల నుండి ఒంటిగంట వరకూ మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకూ జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే వారు ఉదయం 8.30 గంటల నుండి గ్రేస్ పిరియడ్ 9:30 గంటల వరకూ, మధ్యాహ్నం 1:30 గంటల నుండి 2.30 వరకూ అభ్యర్థులను పరీక్షా కేంద్రానికి అనుమతిస్తారని, నిర్ణీత సమయానికి రాని వారికి పరీక్ష కేంద్రానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద ఇన్విజిలేటర్, ఎపిపిఎస్‌సి అధికారులు, పరీక్ష నిర్వహణకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది గానీ, ఇతర వ్యక్తులుగాని ఉండరాదని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ఎలాంటి స్మార్ట్ వాచీలు, మొబైల్ ఫోన్లు, ఐపాడ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు. పరీక్షా కేంద్రానికి సంబంధించిన ప్రాంతంలో ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. పరీక్ష నిర్వహించే తేదీల్లో పరీక్ష కేంద్రం నుండి వెళ్లే ఆర్‌టిసి బస్సులను పరీక్ష కేంద్రం వద్ద రిక్వెస్ట్ స్టాపునకు చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు.

3న ఏలూరులో కొబ్బరి రైతుల జిల్లా సమావేశం

ఏలూరు అర్బన్:కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 3న ఏలూరులో కొబ్బరి రైతుల జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం పది గంటలకు స్థానిక పవర్‌పేట, డాక్టర్ చెన్నకేశవుల రంగారావు వీధిలోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి తోట శ్రీనివాసరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కర్ ఉన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ

ముర్రిపాలపై అవగాహనా ర్యాలీ

జంగారెడ్డిగూడెం: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టించడం వల్ల తల్లి నుంచి బిడ్డకు మొదటి టీకాగా ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.బ్యూలా తెలిపారు. మంగళవారం జంగారెడ్డిగూడెం ఐసిడిఎస్ కార్యాలయం నుంచి నిర్మల హాస్పిటల్ వరకూ తల్లిపాల వారోత్సవాలు 2023 కార్యక్రమాల్లో భాగంగా తల్లి ముర్రిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ బ్యూలా మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలు మొదటి రోజు ఉద్యోగులైన తల్లులకు, వ్యాపారాలు చేసుకునే తల్లులకు ముర్రుపాలు గురించి అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి తల్లి తప్పనిసరిగా ఆరు నెలల వరకూ తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన వెంటనే అదనపు ఆహారాన్ని అలవాటు చేయాలని తెలిపారు.

మహిళలకు భద్రత కరువు : టిడిపి

బుట్టాయగూడెం: జగన్ పాలనలో రాష్ట్రంలో మహిళకు భద్రత కరువైందని, ఆర్థిక ఎదుగుదల లేదనినియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం లక్ష్మడుగూడెం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమంలో తెలుగు మహిళలు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి మహిళలకు అండగా, భరోసాగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బొరగం మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే మహిళలు ఎవరి మీద ఆధార పడకుండా వారంతట వారు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. ఉచితంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించటం జరుగుతుందని తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకా తిరుమలకు అమెరికా దేశస్థులు(ఎన్ఆర్ఐ) శ్రీమతి స్వాతి అంగర విరాళాన్ని అందజేశారు. అన్నదానం ట్రస్టుకు 315 డాలర్లు, గోసంరక్షణ ట్రస్టుకు 315 డాలర్లు, ఆగమ పాఠశాల విద్యార్థి పథకానికి 315 డాలర్లు వెరసి 945 యూఎస్ డాలర్లు సుమారుగా రూ.77 వేల 777 విరాళాన్ని చెక్ రూపంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ద్వారకాతిరుమల పేరు మీద కొరియర్ ద్వారా అందజేశారని ఆలయ కార్యనిర్వాహక అధికారి శ్రీ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి : టిడిపి

పోలవరం: కడమ్మ స్లూయిజ్ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని టిడిపి నియోజక వర్గ రైతు సంఘం అధ్యక్షులు కుంచే దొరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం పోలవరం మండలంలో తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుకి ఇరువైపులా నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వరదల సమయాలలో ఏటుగట్టుకి కుడివైపున ఉన్న పంట పొలాలు నీట మునిగి రైతులు నష్టపోయారని తెలిపారు. టిడిపి హయాంలో కడమ్మ స్లూయిస్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి వరద జలాలను గోదావరిలోకి పథకం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి కడమ్మ స్లూయిజ్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం చేయాలన్నారు. కొత్తూరు చెరువు ఆయకట్టు గేట్లు తెరుచుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయానికి విరాళం

ముదినేపల్లి: జిల్లాలో ప్రసిద్ది పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం ఆలయ ముఖద్వారానికి వెండి తాపడం చేయు నిమిత్తం దాత మంగళవారం నగదు విరాళంగా అందజేశారు. గుడివాడకు చెందిన అడపాల నాగప్రసాద్, శృతి దంపతుల కుమారై షిరీన్ స్వామివారి దేవస్థానం యొక్క అంతరాలయ ముఖద్వారంకు వెండి తాపడము చేయు నిమిత్తం రూ.25వేలు నగదును ఆలయ అధికారులకు అందచేశారు.

ప్రకాశరావుకు ఉద్యోగోన్నతి

ముదినేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్యప్రకాశరావు పదోన్నతిపై కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్టేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలులు స్వీకరించారు. ఈ సందర్భంగా పదోన్నతిపై కైకలూరు వెళ్లిన సూర్యప్రకాశరావుకు మంగళవారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి ప్రకాశరావుకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకం

ఉంగుటూరు: నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘ సర్వసభ్య సమావేశం కళాశాలలో మంగళవారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమైందని 50 వసంతాల వేడుకలు, శ్రీ స్వామి అరవిందుల 150 వ జయంతిని ఘనంగా నిర్వహించి, ఈ కళాశాల గొప్పతనాన్ని, పూర్వవైభవాన్ని చాటి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడారు.

గోదాములో తనిఖీ

భీమడోలు: మధ్యాహ్న భోజన పథకానికి, ఐసిడిఎస్ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాలకు, రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న సరుకులలో జూలై నెలకు సంబంధించిన తేడాలను సరిచేయాలని పాతూరు సివిల్ సప్లైస్ గోదాం పరిధిలోని ద్వారకాతిరుమల, భీమడోలు, దెందులూరు మండలాలకు చెందిన రేషన్ షాప్ డీలర్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ రాజుకు విజ్ఞప్తి

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

నూజివీడు రూరల్: మండలంలోని హనుమంతుల గూడెంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జోధారులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి జరిపి ఎనిమిది మంది పేకాట రాయుళ్ళను అదుపులోనికి తీసుకున్నా మన్నారు. రూరల్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం పట్టుబడ్డ వారి వద్ద నుంచి రూ.10 వేలు నగదును స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై దాడి

నూజివీడు రూరల్: జంగం గూడెం గ్రామంలో సరిహద్దు విషయంలో మంగళవారం గొడవ జరిగింది. ఈ ఘర్షణలో కోటపాటి వాసు(40), శివ పార్వతమ్మ(55) కళ్లల్లో కారం కొట్టి ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అదే గ్రామంలో కొంతమంది కూడా వారిపైన దాడి చేసినట్లు వారు తెలిపారు. వారిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించుచున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

భీమడోలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఏడుగురుపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. వీరందరినీ మంగళవారం భీమడోలు కోర్టుకు హాజరు పరిచామన్నారు. విచారణ అనంతరం ఇంఛార్జి న్యాయమూర్తి షేక్ మొహమ్మద్, అబతాలిబ్ పర్వీజ్ నిందితులు ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.70 వేలు జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడి

చింతలపూడి: సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసినట్లు చింతలపూడి ఎస్ఇబి సిఐ సుంకర సాయి స్వరూప్ అన్నారు. చింతలపూడి స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో సబ్ సిబ్బంది నాగిరెడ్డి గూడెం గ్రామం, కామవరపుకోట మండలం కొత్తూరు గ్రామాలలో దాడులు జరిపి నాగిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన భూక్యా రమేష్, వడిత్యా సరోజిని అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను, ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి, 100 లీటర్ల బెల్లపు ఊటను, కొత్తూరు గ్రామానికి చెందిన చిలకని పద్మ అనే మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

3న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలి

ఆదివాసీ జెఎసి పిలుపు

ప్రజాశక్తి - వేలేరుపాడు

మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆగష్టు 3న జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వేలేరుపాడు ఆదివాసీ జెఎసి నాయకులు ధర్ముల రమేష్ కోరారు. భూదేవి పేట గ్రామంలో జెఎసి ముఖ్యుల సమావేశం మంగళవారం పిట్టా వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ మణిపూర్ ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, ఆదివాసీ మహిళలను నగ్నంగా రోడ్డుపై ఊరేగింపులకు వ్యతిరేకంగా ఈనెల 3న ఆంధ్రప్రదేశ్ మన్యం రాష్ట్ర బంద్ విజయంతం చేయాలని ఆదివాసీ, గిరిజన సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఇటీవల వచ్చిన వరదలతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని మండలంలో 3న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రద్దు చేసిన జీవో నెంబర్ 3 చట్టబద్ధత కల్పించి, ఆదివాసులకు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోయ వాల్మీకిలకు ఎస్‌టి జాబితాలో చేరుస్తామన్న అసెంబ్లీ తీర్మానం తక్షణమే రద్దు చేయాలని, పోలవరం వరద బాధితులకు పునరావాస కేంద్రాలు కల్పించి తక్షణ సహాయ, సహకారాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మడివి దుర్గారావు, ఊకే ముత్యాలరావు, మిరియల శ్రీను, కట్టం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న నాయకులు..

దేవస్థాన సూపరింటెండెంట్‌కు ఉద్యోగోన్నతి

ద్వారకాతిరుమల: శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంకు చెందిన ఆలయ ఉద్యోగికి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఆలయ ఉద్యోగి ఎంఎస్ఎల్.శ్రీనివాస్ ప్రస్తుతం ద్వారకాతిరుమల దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను ఆలయ కార్య నిర్వాహణ అధికారి వేంద్ర త్రినాధరావు అందజేశారు.

ఎంఎల్ఎను కలిసిన ఎస్ఐ

ముదినేపల్లి: పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ డి.వెంకటకుమార్ మంగళవారం కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛమును అందజేశారు.

ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి : సిఐటియు

కుక్కునూరు: ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి, ఆటో కొనుగోలుకు అవసరమైన రుణాలను ఎస్సి, ఎస్‌టి, బిసి కులాలు వారికి కార్పొరేషన్ల ద్వారా ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఆర్ ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సుందరయ్య భవనం, ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ రవాణా రంగంలో అత్యధిక మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న వారిలో ఆటో రిక్షా డ్రైవర్లది కీలక స్థానమన్నారు. దినదిన గండం నూరేళ్ల ఆయుష్ అన్న చందంగా వారి బతుకులు ఉన్నాయని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగాలు రాక, ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించక ఆటో డ్రైవర్లుగా జీవనోపాధి పొందుతున్నారన్నారు. నేడు గ్రామాల్లో, పట్టణాల్లో నిరుద్యోగం పెరగడం, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో చాల మంది నిరుద్యోగులు ఆటో డ్రైవర్లుగా బతుకుతున్నారన్నారు. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు సమయంతో నిమిత్తం లేకుండా రాత్రి, పగలు ప్రయాణికులకు సేవాలందిస్తున్నారన్నారు. అరకొర ఆదాయాలతో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు కుక్కునూరులో పార్కింగ్ స్థలం లేక పోవడం వలన ప్రయాణీకులు ఆటోలు ఎక్కడం లేదని, కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటోలకు కుక్కునూరు సెంటర్‌లో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. లేనిచో ఆటో కార్మిలంతా కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలియజేశారు.

'చైతన్య'లో అత్యుత్తమ విద్యాబోధన

ప్రిన్సిపల్ నాగరాజు

ప్రజాశక్తి - ముసునూరు

2021 - 22 సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఘనత చెక్కపల్లిలోని చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ కే దక్కుతుందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ మరీదు నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మా పాఠశాలలో చదివిన సాయిల కుసుమ దీప్తి 566 మార్కులతో మండల టాపర్‌గా నిల్చిందన్నారు. అదేవిధంగా 2022 - 2023వ సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఎం.లావణ్య 569 మార్కులు సాధించి మండల టాఫర్‌గా నిల్చిందన్నారు. 2015 - 2016వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఇంగ్లీషు మీడియంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో అవార్డులు పొందడం పరిపాటిగా మారిందన్నారు. జా తీయ మహిళా దినోత్సవం వేడుకలు, పర్యావరణ దినోత్సవం వేడుకలు, ప్లాస్టిక్ నిషేదం, బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహిస్తూ గ్రామాల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

అవార్డు అందుకుంటున్న విద్యార్థి

ఒరిజినల్ దస్తావేజు పోయినది

నా భర్త గారు అయిన మొగదాటి (లేటు) వెంకటేశ్వరరావు గారి పేరున ఎన్‌టిఆర్ జిల్లా, మైలవరం మండలం, టి.గన్నవరం గ్రామంలోని ఆర్.యస్.నెం.156/2లో య.1-00 సెంట్లు భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు (నెం. 1372/1991) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు.

మొగదాటి శాంతమ్మ
భర్త: వెంకటేశ్వరరావు (లేటు)
ఈదర గ్రామం, ఆగిరిపల్లి మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 94946 45508

దస్తావేజు పోయినది

లింగాల నాగేశ్వరరావు, తండ్రి: లింగాల వెంకటేశ్వరరావు అను నాకు ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వట్లూరు గ్రామంలో ఆర్.ఎస్.నెం. 188రు దాఖలా చ॥గ॥ 597-5-0 లు స్థలంనకు సంబంధించిన దస్తావేజు నెం. 6870/2016రుగా రిజిస్ట్రేషన్ పొందియున్నవి. 10 జులై 2023 వ తేదీన ఏలూరులో మా ఇంటి నుండి వేరే ఇల్లు మారుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు నా అడ్రసుకు అందజేయగలరు.

లింగాల నాగేశ్వరరావు
డో.నెం. 28-1-79, శాంతి నగర్,
5వ రోడ్డు, ఏలూరు. సెల్: 93816 09687

వ్యక్తిగత కుళాయిల ఏర్పాటుపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - మండవల్లి

పంచాయతీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నివాసానికి గుట్టు చప్పుడు కాకుండా కుళాయిను ఏర్పాటు చేస్తుంటే నిద్రపోతున్నారా అంటూ సర్పంచి, కార్యదర్శిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీకి సంబంధం లేకుండా ఎవరికి వారే కుళాయిలు కనెక్షన్ వేసేసుకుంటుంటే మీరెందుకు ఉన్నట్లు అని గ్రామస్తులు ప్రశ్నించారు. మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో వ్యక్తిగత కుళాయిల పంపిణీపై సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభలో ఇఒపిఆర్‌డి ఆనందబాబు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యక్తిగత కుళాయిలపై గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో రెండు మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించలేకపోతున్నారని గ్రామస్తులు ఆయనకు తెలిపారు. గ్రామంలో అనధికార పంపులు 100కు పైనే ఉన్నాయని, వాటిపై నేటికీ చర్యలు తీసుకోలేదని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయిని ఇచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత సంవత్సరమే రూ.69 లక్షల నిధులు మంజూరు చేస్తే, ఇంతవరకూ గ్రామస్తులకు తెలియ చేయలేదని తెలియజేశారు. ఎస్సి, ఎస్‌టి కులాలకు చెందిన వారికి రూ.7 వేలు, బిసి, ఒసి కులాలకు చెందిన వారికి రూ.10 వేలు చొప్పున వసూలు చేసి వ్యక్తిగత కుళాయిలు ఇచ్చే విధంగా ప్రజాభిప్రాయాలను తీసుకోకుండా, ఎవరిని అడిగి తీర్మానించారంటూ తెలుసుకోవాలని ఆయనను కోరారు. రూ.10 లక్షలు పైబడి వ్యక్తిగత కుళాయిలపై సంవత్సరాల తరబడి బకాయిలు ఉంటే వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉపయోగపడని కొండరాయి చెరువుకు పథకానికి రూ.10 లక్షలు ఎందుకు ఖర్చు చేశారని ప్రశ్నించారు. దీనిపై సర్పంచి, కార్యదర్శి నోరు విప్పాలంటూ నిలదీశారు. దీనిపై సమాధానం చెప్పకపోవడంతో ఆనందబాబు కల్పించుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అనాధికారంగా ఉన్న పంచాయతీ కుళాయిలను పూర్తిస్థాయిలో విచారించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కార్యదర్శికి ఆదేశించారు. బకాయిలు ఉన్న వ్యక్తిగత కులాయి పన్నును వెంటనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి ఆనందబాబు

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం మండలం, భాలేపల్లి గ్రామం, డో.నెం. 1-6 కాపురస్తులు యర్రంశెట్టి రాము రంగారావు, S/o. అరవాలు అను నేను 10-07-2023వ తేదీన భాలేపల్లి నుండి వీరవాసరం మోటారు సైకిల్‌పై జిరాక్స్ తీయించుకొనుటకు వస్తుండగా నా యొక్క ఒరిజినల్ పదకొండు దస్తావేజులు పడిపోయినవి. దస్తావేజు నెంబర్లు 3816, 3817, 3818, 3819, 3820, 3821, 3822, 3823, 3824, 3825, 3826, తేది.26-08-2020, SRO ద్వారకానగర్ గల ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

యర్రంశెట్టి రాము రంగారావు
S/o. అరవాలు, 1వ వార్డు,
డో.నెం. 1-6, భాలేపల్లి గ్రామం
వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9550457999

బహిరంగ ప్రకటన

నా క్లయింటు **వలుకుల లక్ష్మణరావు, తండ్రి: ఆంజనేయులు,** డో.నెం. 1-11, ఆంద్రేయపురం, పెదపాడు మండలం, ఏపురు గ్రామం వారి యొక్క సంజాయిషీ పై తెలియచేయునది ఏమనగా.., నా క్లయింటు సత్రంపాడు ఎస్.బి.ఐ. కాలనీ నుండి సత్రంపాడు చింత చెట్టు సెంటరుకు జిరాక్సు నిమిత్తం జిరాక్సు సెంటరుకు వెళుచుండగా **ఒరిజినల్ డాక్యుమెంట్సు నెం. 7294/1984, ఎస్.ఆర్.ఓ. ఏలూరు** గల డాక్యుమెంటు పోయినది.
__దస్తావేజు వివరములు:__ ***తూర్పు:*** వే రోడ్డు. ***పశ్చిమ:*** వైడ్ రోడ్డు. ***దక్షిణం:*** వెంకటేశ్వరరావు గారి స్థలం. ***ఉత్తరం:*** మజ్జిగ రామారావు స్థలం. పైన తెలిపిన దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల నాకు తెలియపరిచిన తగిన బహుమతి ఇవ్వబడును. సదరు దస్తావేజుపై ఎవరైనా లావాదేవీలు జరిపిన ఎడల అవి చెల్లనేరవు, అంతేకాక ఎటువంటి లావాదేవీలు జరిపిన వారిపై చట్టరీత్యా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

సి.వి.శ్రీనివాస శాస్త్రి
అడ్వకేట్, కండ్రిఖగూడెం, ఏలూరు.
సెల్: 98482 73389

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - భీమడోలు

ప్రస్తుత రబీ సీజన్లో రైతులు ఇ-క్రాప్ నమోదు కార్యక్రమ సేవలను సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్‌పివి ఉషారాణి, తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 2023 - 24 సంవత్సరపు రబీ సీజన్‌కు సంబంధించి ఇ-క్రాప్ నమోదు కార్యక్రమంపై గ్రామ, సచివాలయ రెవిన్యూ అధికారులకు, సచివాలయ వ్యవసాయ సహాయకులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, ఇ-క్రాప్ నమోదు కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా ప్రతీ సర్వే నెంబర్‌లో కొనసాగుతున్న పంట వివరాలు నమోదు అవుతాయన్నారు. దీనిలో నమోదైన రైతులకు ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం విషయమై ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోళ్లు, సకాలంలో వాటి చెల్లింపులు జరుగుతాయన్నారు. వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ పరంగా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇ- క్రాప్ నమోదు ఆధారంగా ప్రభుత్వ పథకాల లబ్ధి వారికి చేరుతుందన్నారు.

టి.నరసాపురం: రైతులు ఇ-క్రాప్‌లో తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ జెవి.సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో సోమవారం ఇ-క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇ-పంట నమోదు చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే భీమా పొందవచ్చని తెలిపారు. రైతు పండించిన పంటను సులభంగా విక్రయించు కోవచ్చున్నారు. రైతు భరోసా వంటి పలు సౌకర్యాలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, విఆర్ఒలు, వ్యవసాయ, ఉద్యానవనం సహాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్ద నింద్రకొలనులో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణారావు మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వం 2009లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయకుండం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 12, 14 మెమోని రద్దు చేసి, సంక్షేమ బోర్డును పునర్ధించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ.12,80 కోట్ల నిధులను సంక్షేమ బోర్డుకి జమ చేసి పెండింగ్ క్లెయిములు పరిష్కరించాలన్నారు. ఇతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలో అమలు జరుగుతున్న నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాలను మన రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిలకు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను సమీకరించి చలో అమరావతి చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చినిమిల్లి రాంబాబు, సోడాబత్తుల వాసు, చల్లగాలి పెద్దిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలో జూనియర్ కళాశాలకు ప్రతిపాదనలు

చాట్రాయి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నంపేట నందు కో ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీ ప్రారంభించడం కోసం ప్రతిపాదన పంపడం జరిగిందని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి బి.ప్రభాకర్ రావు తెలిపారు. కాలేజీలో తరగతి గదులు, ప్లేగ్రౌండ్, టాయిలెట్లు, ఐఎఫ్‌పి ప్యానల్సు, వసతులు పరిశీలన కోసం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి బి.ప్రభాకర్ రావు మంగళవారం చాట్రాయి మండల విద్యా శాఖ అధికారి విఎస్‌వి.బ్రహ్మాచారితో కలసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నంపేటను సందర్శించారు.

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
M.V.O.P. 21/2022

Between:
గెల్లి కృష్ణ @ పేతురు **-పిటిషనర్**
మరియు
గేదెల అజయ్‌కుమార్ @ అజయ్ @ చోటు మరియు వగైరాలు **-రెస్పాండెంట్స్**

R-1: గేదెల అజయ్‌కుమార్ @ అజయ్ @ చోటు, S/o. వీర రాఘువులు, డో.నెం. 25-9-80, శివరావుపేట, Near డి.ఎన్.ఆర్. కాలేజి, గొల్లవానితిప్ప, భీమవరం టౌన్, ప॥గో॥జిల్లా - 534230.

పై నెంబరు కేసులో మీ హాజరు నిమిత్తం **ది. 07-08-2023వ తేదీన** శ్రీ కోర్టు వారు వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చవలెను.

__వాయిదా: ది. 07-8-2023__

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

నందెపు చిన వెంకటేశ్వరరావు
కుంచె శ్రీనివాసరావు
అడ్వకేట్స్, అమలాపురం
సెల్: 9885464893

In the Court of The Principal Senior Civil Judge at Kakinada
H.M.O.P. No. 326/2022

Between:
Ravu Venkata Satya Sita Jyothi Swaroopa ***...Petitioner***
AND
Dr. Kotagiri Butchiah Rayanam and another ***...Respondents***

To: R-2: Vasakarala Anusha, C/o. Dr. Kotagiri Butchaiah Rayanam, aged 34 years R/o. H.No. 10-6-1384, Revenue Ward No. 13, School Road Ending Point, Seshadri Nagar, Jangareddygudem, W.G.District.

పై నెంబరు పిటిషనులో పిటిషనరు, 2వ రెస్పాండెంట్ అయిన మీపై వివాహము రద్దుచేయమని కోరుతూ పై పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో 2వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ వారి ద్వారాను ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.23-8-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మేడపాటి ధర్మారెడ్డి
ఎ.యు.వి.స్వామి, అడ్వకేట్స్,
కాకినాడ. సెల్: 80995 05050

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి పశ్చిమ గోదావరి జిల్లా :: ఏలూరు
ఐ.ఎ.నెం. 530/2023
ఐ.ఎ.నెం. 191/2023
__ఒ.యస్.నెం. 26/2010__

__బిట్వీన్:__
తంగెళ్ళ వెంకట రాంబాబు మరియొక్కరు **...పిటీషనర్సు /వాదులు**
మరియు
ఉప్పాల కళ్యాణి వగైరాలు **...రెస్పాండెంట్లు**

__పిటీషనర్సు దాఖలు చేసిన పబ్లికేషన్__

పై నెంబరు గల పిటీషనులో రెస్పాండెంట్లు 15 మరియు 16 వారులు అయిన 15 రాయంకుల సత్యవతి, భర్త: సోభనాద్రి మరియు 16 రాయంకుల శ్రీహరి, తండ్రి: పోభనాద్రి, డో.నెం. 3-354, దర్మాజిగూడెం, లింగపాలెం మండలం, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది.16-08-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలుపవలెను.** లేని ఎడల సదరు పిటీషను ఏకపక్షముగా విచారణ చేయుదురని తెలియపర్చుచున్నాము.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు, 1-8-23. అడ్వకేట్స్, ఏలూరు.

ఇంటర్న్‌షిప్ విజయవంతం

ఏలూరు అర్బన్: కైకలూరు వైవిఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, స్థానిక కొత్తూరు జూట్ మిల్లులో ఆరు నెలల సెమిస్టర్ ఇంటర్న్ షిప్ విజయవంతంగా పూర్తిచేసుకున్నారు. ఈ విద్యార్థులకు కొత్తూరు జూట్ మిల్లు హెచ్‌ఆర్ మేనేజర్ ఎన్ఎ.సురేష్ సర్టిఫికెట్‌లు అందించారు. విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు బి.జగన్మోహనరావు కళాశాల తరుపున మిల్లు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా రామచంద్రరావు జయంతి

ఉంగుటూరు: గ్రామ మాజీ సర్పంచి గుణ్ణం రామచంద్రరావు జయంతి వేడుకలు గ్రామస్తులు, ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో ఉన్న రామచంద్ర రావు విగ్రహానికి గ్రామస్తులు నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు .

అభివృద్ధి పనులపై ఎంఎల్ఎ సమీక్ష

ముదినేపల్లి:మండలంలోని పెదపాల పర్రు, కోడూరు గ్రామాల్లో మంగళవారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 9/2023
__ఇన్ ఓ.యస్.నెం. 22/2017__

__బిట్వీన్:__
బొడ్డు పద్మరాజు ***...డి. హెచ్. ఆర్***
మరియు
సాధనాల రవిప్రసాద్ ***...జె.డి.ఆర్***

పై నెంబరులో డి.హెచ్.ఆర్.కి ఈ జె.డి.ఆర్. ఇవ్వవలసిన డిక్రీ బాకీకి గాను ఈ జె.డి.ఆర్. తాలూకా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పై కోర్టు వారి ఎదుట **ది. 28-08-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ వేలం వేయుదురు.** కావలసిన వారు హాజరై పాట పాడుకొనవచ్చును.

__SCHEDULE__

West Godavari District, Tadepalligudem, Sub-Registry, Tadepalligudem Municipality, 32nd Ward, in 1st Block, Near D.No. 1-19-12/1,2, Kadakatla Area, R.S.No. 39 an extent of 230 Sq. Yards in the Eastern side vacant site in total extent of Ac.0-21 cents within the following boundaries:
East: Municipal Road.
South: Sadanala Gold Raju.
West: Puba Nandhiyya and Others.
North: Rapaka China Sitayya and Others.
Plaintiff Value : Rs.4,00,000/-
Ameena Value : Rs.6,90,000/-

G.V.DWARAKANATH
Tadepalligudem, 01-08-2023. Advocate, Tadepalligudem.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
__E.P. No. 24/2022__ in **__O.S. No. 312/2021__**

__Decree Holder:__
Annamreddi Subbarao
AND
__Judgement Debtor:__ Boddu Nethiyya

పై నెంబరు డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి వేలం నిమిత్తం ది. 21-08-2023కి వాయిదా వేసియున్నారు. కావున కావలసినవారు **ది.21-08-2023న ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టుకు వచ్చి పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.**

__schedule__

West Godavari District, Tadepalligudem Sub Registrar, Tadepalligudem Mandal, Pullayigudem Gram Panchayat area, H/o. Apparaopeta, Pullayigudem Village, R.S.No. 511 Near by D.No. 2-63 to an extent of 145 Sq. Yards of Site and RCC Roof Building therein within the following Boundaries.
__East:__ Pedamurthi Venkateswararao Building. ***__South:__*** Dirsipo Polayya Building. ***__West:__*** Main Road. ***__North:__*** Panchayat Cement Road.

Within the above boundaries an extent of 145 Sq. Yards of site and RCC roof building with all easement rights.
D.H.R. Valeu : Rs. 4,00,000/-
Amin Value : Rs.10,00,000/-
There are no encumbrance on the schedule property as per E.C.

KUSULURI SIVA RAMA KRISHNA
Advocate for D.H.R
Tadepalligudem, 31-7-23. Tadepalligudem
Cell: 99490 760266

__NOTICE__
In The Court Of The Senior Civil Judge :: Tadepalligudem
I.A.No. 709/2021
__in A.S.No. 3/2011__

__Between:__
1) Edupalli Rama Rao (Died)
2) Edupalli Srikanth ***...Appellants***
AND
1) Edupalli Atchyuta Ramayya (Died)
2) Edupalli Durga Rao and Others ***...Respondents***

__TO: Respondents No. 4 to 7:__
4) Yandrapu Durgavathi, W/o. Satyanarayana, Age 66, Hindu, Female, House Wife, Yagarlapalli, Tadepalligudem TPG PJCJC.
5) Maradani Santhi, W/o. Kiran Kumar, Age 49, Hindu, Female, Husband's Protection, Veerammakunta, Pedapadu Mandal, Eluru PJCJC.
7) Edupalli Rajesh, S/o. Achutaramayya, Age 49, Hindu, Male, Business, D.No. Nill, New House, Behind Gamini Function Plaza, Ramachandrarao Peta, Tadepalligudem TPG PJCJC.

Please take notice that the above A.S. is filed by the appellants against the respondents. The matter is posted for the appearance of the above **4 to 7 Respondents on Dt. 11-08-2023 from 10:30 A.M. onwards,** on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjucate according to law in your absence.

G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Tadepalligudem, 31-7-23. Advocates, Tadepalligudem.